క్లుప్తంగా

వరి విత్తనాల పంపిణీ



పెద్దపేటలో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

బూర్జ: మండలంలోని పెద్దపేట ఆర్బీకేలో టీడీపీ రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఆనెపు రామకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో రైతులకు మంగళవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందజేస్తుందన్నారు. ఉప సర్పంచ్ బి.వి.కె.నాయుడు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నీలమ్మ సంబరాలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సరుబుజ్జిలి: మండలంలోని మతలబుపేట గ్రామ ఇలవేల్పు నీలమ్మ తల్లి సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఖరీఫ్ వ్యవసాయ పనులకు ముందు అమ్మవారికి ఘటాలుతో ముర్రాటలు చెల్లిస్తే పంటలు బాగుంటాయని నమ్మకంతో ప్రతిఏటా సంబరాలు చేస్తుంటారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గుంతలో దిగబడిన లారీ



రహదారి మధ్యలో కూరుకుపోయిన లారీ

సరుబుజ్జిలి: అలికాం–బత్తిలి రహదారిలో పోలీస్ స్టేషన్‌కు సమీపంలో భారీ లోడుతో వెళ్తున్న లారీ మంగళవారం దిగబడింది. శ్రీకాకుళం నుంచి ఒడిశా రాష్ట్రానికి తరచూ భారీ వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. లారీ దిగబడడంతో ట్రాఫిక్ కొంతసమయం ట్రాఫిక్ నిలిచిపోయింది.

రోడ్డు ప్రమాదంలో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆవు మృతి చెందింది. గేదెలపోలూరు గ్రామానికి చెందిన ధర్మారావు మంగళవారం తన ద్విచక్ర వాహనంపై మెళియాపుట్టి వస్తున్నారు. ఏకలవ్య పాఠశాల దాటిన తర్వాత మర్రిపాడు గ్రామానికి చెందిన ఇప్పిలి వెంకటరావుకి చెందిన ఆవు ఒక్కసారిగా ద్విచక్ర వాహనం పైకి దూసుకురావడంతో తప్పించే క్రమంలో బలంగా ఢీకొన్నాడు. ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ధర్మారావుకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి మెళియాపుట్టి పీహెచ్‌సీలో చికిత్స అందించారు. మెరుగైన వైద్య సేవల కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

93 శాతం ఉత్తీర్ణత

హిరమండలం: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ పీఈఎస్ పట్నాయక్ మంగళవారం తెలిపారు. ఇటీవల జరిగిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో కాలేజీకి చెందిన విద్యార్థులు 93 శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ గ్రూప్‌లో ఐదుగురు విద్యార్థులు పరీక్షలు రాయగా ఐదుగురు ఉత్తీర్ణత సాధించారు. బైపీసీలో 14 మందికికి 14 మంది, సీఈసీలో పది మందికి 8 మంది ఉత్తీర్ణత పొందారు. ఒకేషనల్ ఎంఏటీ గ్రూపులో ఐదుగురుకు ముగ్గురు, ఈఈటీలో ఏడుగురికి నలుగురు, ఈటీలో ఐదుగురికి ఐదుగురు ఉత్తీర్ణత పొందినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

పొందూరు: మండలంలోని కింతలి గ్రామంలో సర్వే నంబర్ 48–17–ఏ లో గల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారంటూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మాజీ సర్పంచ్ దవళ గణపతిరావు ఫిర్యాదు చేశారు. 2013–18 మధ్య కాలంలో తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఈ స్థలంలో చెత్త సంపద తయారీ కేంద్రం నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ స్థలం నాది అంటూ పాస్‌బుక్ తీసుకురాగా.. అప్పటి తహసీల్దార్ ఆ స్థలంపై విచారణ జరిపి ప్రభుత్వ స్థలంగా నిర్ధారించారన్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో భవన నిర్మాణం జరుగుతుండటంతో దీనిని అడ్డుకోవాలని అధికారులను కోరారు. తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని తహసీల్దార్‌ను కోరారు.

● అవగాహన



సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి పట్ల అవగాహన ఉండాలని సరుబుజ్జిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాహితీప్రియదర్శిని అన్నారు. సికిల్ సెల్ ఎనీమియా నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని వెన్నెలవలస గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. 0 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న గిరిజనులందరూ సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు చేసుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ జరిగిన వారికి ప్రభుత్వం నెలకు రూ.10 వేల పింఛన్ మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ మోహన్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

– సరుబుజ్జిలి

● వైద్య సేవలు



ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందజేయడం జరుగుతుందని గుత్తావల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.రోజా అన్నారు. బూర్జ మండలంలోని అల్లెన పంచాయతీ కిలంతర, పీఎల్ దేవిపేట గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో భాగంగా వేర్వేరుగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ రెండు గ్రామాల్లో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు అందజేశామన్నారు. బీపీ, సుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి తనిఖీలు నిర్వహించామన్నారు. బూర్జ, గుత్తావల్లి పీహెచ్‌సీల హెల్త్ సిబ్బంది, ఆప్తాలమిక్ ఆఫీసర్ బి.ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

– బూర్జ

● పురస్కారం



పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పాతపట్నంకు చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టు తరఫున మంగళవారం విద్యాపురస్కారాన్ని ప్రదానం చేశారు. హిరమండలం మండలంలోని ధనుపురం ప్రాథమిక పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన మామిడి త్రివేణి, ముద్దల గుణశేఖర్‌లకు ట్రస్ట్ అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు విద్యా పురస్కారంతోపాటు నగదు అందించి అభినందించారు. ఎంఈఓ రాంబాబు, హెచ్‌ఎంలు చంద్రరావు, రామకృష్ణ, మండల ప్రత్యేకాహ్వానితుడు తూలుగు తిరుపతిరావు మాస్టారు, సర్పంచ్ దారపు ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– హిరమండలం

ప్రభుత్వ పాఠశాలల్లో..

నాణ్యమైన విద్య



కొత్తూరు: స్టూడెంట్స్ కిట్లు అందజేస్తున్న డిప్యూటీ ఈఓ విలియమ్స్

- డిప్యూటీ ఈఓ విలియమ్స్
- స్టూడెంట్ కిట్లు పంపిణీ

కొత్తూరు: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందివ్వడం జరుగుతుందని టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్ అన్నారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎ.గోవిందరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో స్టూడెంట్స్ కిట్లను మంగళవారం ఎంఈఓ గోవిందరావు, హెచ్‌ఎంతో కలిసి పంపిణీ చేశారు. డిప్యూటీ ఈఓతోపాటు పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నైతిక విలువలతో కూడిన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ప్రోత్సాహకంగా పలు రకాల పథకాలు ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సరుబుజ్జిలి: కిట్లు అందజేస్తున్న హెచ్‌ఎం, నాయకులు

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించామన్నారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎద్దు వరహాలమ్మ సుందరనారాయణ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎద్దు గోపాలదాసు నాయుడు, సర్పంచ్ కుంచాల రత్నాలు, పాఠశాల కమిటీ చైర్మన్ వడమ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గండివలస ఆనందరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు భానోజీరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురుషోత్తపురంలో..

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్లను విద్యార్థులకు టీడీపీ నాయకులు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం తులసీరావు, నాయకులు కిల్లి సిద్ధార్థ, కిల్లి శేషుమోహనఅప్పలనాయుడు, కిల్లి గోవిందరావు, కిల్లి హరికృష్ణ, కొత్తకోట విష్ణు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● ఎంపీపీ కర్నేన దీప



మాట్లాడుతున్న ఎంపీపీ కర్నేన దీప

బూర్జ: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీపీ కర్నేన దీప అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ సిబ్బంది కలిసి పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ప్రజలు పొందిన సేవలను వివరించారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు హనుమంతు గోపి (మాస్టర్) మాట్లాడుతూ నారాయణపురం ఎడమ కాలువ సుమారు 1.5 కిలో మీట్ల పరిధిలో ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టాలన్నారు. రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఆమదాలవలస: మండలంలోని చిట్టివలస గ్రామంలో గల అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రామాపంతుల చైతన్య శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయం ఆవరణలో వ్రతాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, కమిటీ మెంబర్‌లు పాల్గొన్నారు.



స్వామివారి ఉత్సవ విగ్రహం

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



నగదు ప్రోత్సాహాన్ని అందజేస్తున్నడిప్యూటీ ఈఓ విలియమ్, ఎంఈఓ

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన పలువురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను మంగళవారం హెచ్‌ఎం ఎ.గోవిందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అందజేశారు. ఇదే పాఠశాలలో చదువుకుని ఇస్రో శాస్త్రవేత్తగా పని చేస్తున్న డాక్టర్ ఎన్ని గోవిందరావు పాఠశాలలో అత్యధికంగా మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల నగదును ప్రోత్సాహకంగా ప్రకటించారు. ఈ మేరకు నగదును డిప్యూటీ ఈఓ విలియమ్, విశ్రాంత హెచ్‌ఎం ఎద్దు గోపాలదాసునాయుడు, ఎంఈఓ అందజేశారు. ఈ విధంగా ప్రతీ ఏడాది విద్యార్థులకు ప్రోత్సాహకం అందజేయనున్నట్లు గోవిందరావు తండ్రి తిరుపతిరావు తెలిపారు. హెచ్‌ఎం గోవిందరావు పాఠశాలలో 500 మార్కులు దాటిన ప్రతీ విద్యార్థికి రూ.500 చొప్పున అందజేస్తానని ఇదివరకే ప్రకటించారు. ఈ ఏడాది 15 మంది విద్యార్థులు 500 మార్కులు సాధించడంతో నగదు ప్రోత్సాహం అందజేశారు. ఈ విధంగా ప్రతీ ఏడాది అందజేయనున్నట్లు గోవిందరావు తెలిపారు. నగదు ప్రోత్సాహకాలతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు సర్పంచ్ కుంచాల రత్నాలు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గండివలస ఆనందరావు, పాఠశాల కమిటీ చైర్మన్ వడమ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లుగా కొనసాగించండి

పాతపట్నం: తాము గత ప్రభుత్వంలో వలంటీర్లుగా పనిచేశామని, ప్రస్తుత ప్రభుత్వంలోనూ తమను కొనసాగించాలని ఎంపీడీఓ రామకృష్ణరాజుకు పాతపట్నం పంచాయతీకి చెందిన పలువురు వలంటీర్లు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రాజీనామా చేసిన వలంటీర్లను కొనసాగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో డి.నాగమణి, బి.జ్యోతి, ఎస్.పావని, జె.శ్రావణికుమారి, జి.రాజీ, జి.రమణమ్మ, ఆర్.లావణ్య, సి.లావణ్య తదితరులు ఉన్నారు.

బద్రి ఎంపీటీసీ సభ్యుడు మృతి



బాలచంద్రరావు నాయుడు (ఫైల్)

సారవకోట: మండలంలోని బద్రి ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ మెండ బాలచంద్రరావు నాయుడు(45) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన జెమ్స్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. శ్రీకాకుళంలో క్యూబటా ట్రాక్టర్ షోరూమ్ యజమాని కావడంతో సోమవారం విధులకు వెళ్లారు. అస్వస్థకు గురి కావడంతో జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయనకు భార్య పావని, కుమార్తె హిమజా రామేశ్వరి ఉన్నారు. ఈయన మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పలువురు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు సంతాపం తెలియజేశారు.

నేడు పాఠశాలల ఖాతాల ఆడిట్

హిరమండలం: స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఐదు మండలాలకు సంబంధించి పాఠశాలల అడిట్ జరుగుతుందని హిరమండలం ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు. హిరమండలం, ఎల్‌ఎన్‌పేట, సరుబుజ్జిలి, కొత్తూరు, పాతపట్నం మండలాలకు సంబంధించి ఆడిట్ ఉంటుందన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విధిగా పాఠశాలల బ్యాంక్ ఖాతా బుక్‌లు అప్‌డేట్ చేసి తీసుకురావాలన్నారు. సంబంధిత స్కూల్ హెచ్‌ఎం ధ్రువీకరణ ఉండాలన్నారు. విధిగా అందరూ హాజరుకావాలన్నారు.

పని వద్దు.. పాఠశాల ముద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

పొందూరు: చిన్నారులు పనిలోకి వద్దు.. పాఠశాలే ముద్దు అంటూ మంగళవారం విద్యాశాఖాధికారులు పొందూరులో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పొందూరు ఒకటో నంబర్ ప్రాథమిక పాఠశాలలో బడికి పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదేళ్లు నిండిన పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు పి.వి.రామరాజు, పి.రాజారావు, ఎస్ఎస్ఏ ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ పి.జనార్దనరావు, హెచ్‌ఎం విజయకుమార్, బాల కార్మికశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టండి

ఆమదాలవలస: మహిళా స్వయంశక్తి సంఘాల్లోని మహిళలంతా పంచ సూత్రాలు పాటిస్తూ, తీసుకున్న రుణాల నుంచి ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. మండలంలోని సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద గల తులగాం ఆర్.ఆర్.కాలనీలో సర్పంచ్ సొండి దమయంతి ఆధ్వర్యంలో స్వయం శక్తి సంఘాల మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. గ్రామంలో ఉన్న మహిళా సంఘాలకు బ్యాంకు ఖాతాలు హిరమండలం బ్యాంక్‌లో ఉన్నందున ప్రతీ నెల సంఘ సభ్యులకు పొదుపులు, అప్పులు కట్టుకోవడానికి వ్యయప్రయాసలు ఎక్కువ అవుతున్నాయన్నారు. వాటిని నివారించేందుకు అక్కడ లావాదేవీలన్నీ పూర్తిగా ముగించుకుని ఆమదాలవలస బ్యాంక్‌లో ఖాతాలు ప్రారంభించుకుంటే సమస్య సులభతరం అవుతుందన్నారు. పాత సమాఖ్యలో గ్రామ సంఘం లావాదేవీలన్నింటినీ పూర్తిగా ముగించుకుని, ఆమదాలవలస మండల పరిధిలో మీ గ్రామ సంఘాన్ని సక్రమంగా నడిపించుకోవచ్చని సూచించారు. ఎంపీటీసీ బి.ప్రభావతి, గ్రామ పెద్దలు రాఘవదాసు, నారాయణ దాసు, కృష్ణమూర్తి, క్లస్టర్ కో ఆర్డినేటర్ రామప్పడు, వీఓఏ రేవతి, గ్రామ సంఘం అధ్యక్షురాలు చిన్నమ్మి పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో హోమం



హోమం, బలిహరణ నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ఔపాసన, హోమం, బలిహరణ, హారతి మంత్రపుష్పం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. దీనికి ముందు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి క్షీరాభిషేకం నిర్వహించారు.

స్థల వివాదం



స్కూల్ ప్రహరీకి, రోడ్డుకు మధ్య ఏర్పాటు చేసిన కంచె

నరసన్నపేట: స్థానిక ఇందిరానగర్‌లో గల విజ్ఞాన భారతి స్కూల్ ఎదురుగా బిల్డింగ్ సొసైటీ స్థలంలో మంగళవారం ఉదయం వివాదం చోటుచేసుకుంది. ఈ స్థలం తన అనుభవంలో ఉందని రమేష్ అనే స్థానిక వ్యక్తి స్కూల్‌కు ఎదురుగా సోమవారం కంచె ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం విద్యార్థులు స్కూల్‌కు వచ్చే సరికి మార్గం లేకపోవడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందారు. కంచె తీసేకేందుకు ప్రయత్నించగా రమేష్ అడ్డుపడ్డారు. ఈ స్థలం తనదని, కోర్టు డిక్రీ ఇచ్చిందని కొన్ని జిరాక్స్ కాపీలు చూపించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ ఉపాధ్యాయులు, విశ్వహిందూ పరిషత్‌కు చెందిన పలువురు వచ్చి ఆయనకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. రమేష్ వినకపోవడంతో కంచెను తొలగిస్తుండగా వివాదం నెలకొంది. పోలీసులకు ఉపాధ్యాయులు సమాచారం ఇవ్వడంతో ఏఎస్ఐ అసిరినాయుడు వచ్చి స్థానికులతో కంచెను తొలగించారు. దీంతో విద్యార్థులు స్కూల్లోకి వెళ్లారు. గడిచిన పదేళ్లుగా ఈ స్థల వివాదం నడుస్తుంది. స్కూల్ ప్రహరీకి ఎదురుగా రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలం తనదని రమేష్ వాదిస్తున్నారు. గతంలో ఇలాగే ఒకసారి ఈ స్థలంలో షెడ్ వేసేందుకు ప్రయత్నించగా.. పంచాయతీ అధికారులు తొలగించారు. ఈ స్థలంలో సాగు నీటి కాలువ ఉండేదని, ఇది ప్రభుత్వ స్థలమని స్థానికులు చెబుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



పాతపట్నం: ఎంపీడీఓ వినతిపత్రం అందజేస్తున్న మహిళలు



హిరమండలం: ఈఓకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని బాలాజీ నగర్–2 వీధికి కుళాయిల ద్వారా తాగునీరు అందించాలని ఆ వీధికి చెందిన మహిళలు కోరారు. ఎంపీడీఓ రామకృష్ణరాజుకు బి.నారాయణమూర్తితో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ సమస్యను పంచాయతీ ఈఓ కూర్మారావుకు తెలియజేసినప్పటికీ తమ వీధికి తాగునీరు అందించడం లేదని ఆరోపించారు. తాగునీరు అందించేందుకు ఎంపీడీఓ చర్యలు తీసుకోవాలని కోరారు.

హిరమండలం: సుభలాయ్‌లో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. హిరమండలం పంచాయతీ ఈఓ వై.ఎస్.ఆర్.మూర్తికి మంగళవారం వినతిపత్రం అందించారు. రక్షిత మంచినీటి పథకానికి సంబంధించి కుళాయిల ఏర్పాటుతోపాటు నిత్యం సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ లైట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఈఓ సానుకూలంగా స్పందించారు. తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈఓను కలిసిన వారిలో పిన్నింటి అప్పన్న, పడాల రాము, నారాయణరావు, శివ, వెంకటరావు తదితరులు ఉన్నారు.

చల్లగా చూడమ్మా..



అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పాతపట్నం: మండల కేంద్రంలోని రెల్లివీధి, గాంధీనగర్‌లో నీలమణిదుర్గ అమ్మవారి వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని రెల్లి వీధిని నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. వేషధారణలు, మంగళవాయిద్యాలు, డప్పులు, నెయ్యిముద్దలు, ఘటాలతో అమ్మవారిని ఆలయానికి చేర్చారు. భక్తులు మొక్కులు చెల్లించారు.

రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొత్తూరు: కొత్తూరులోని సీతారామాలయం 7వ వార్షికోత్సవ ఆహ్వాన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆలయ ప్రాంగాణంలో ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ ఉపాధ్యక్షుడు లోతుగెడ్డ తాతబాబు మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 22న సీతారాముల కల్యాణం, అన్నప్రసాద కార్యక్రమంతోపాటు స్థానిక హరిదాసు కోనేరు వద్ద తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతీరోజు కుంకుమ పూజలు ఉంటాయన్నారు. టీటీడీ ఆధ్యాత్మిక మండలి కొత్తూరు మండలం కన్వీనర్ పాగిరి రవి, ఆలయ కమిటీ సభ్యులు పెద్దిన కలశేఖరం, జానకిరామయ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.